# సాక్షి తిరుపతి

శుక్రవారం । 24 । ఏప్రిల్ । 2026




**ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇవ్వండి**

అధికారులు తమ పరిధిలోని ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇచ్చి, అభివృద్ధి చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. - 8లో



**వేడుకగా మహాకుంభాభిషేకం**

గుడిమల్లంలోని శ్రీఆనందవల్లి సమేత పరశురామేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభి షేకం వేడుకగా సాగింది. - 8లో



**రైల్వే సామగ్రి చోరీ**

నాయుడుపేటలోని రైల్వేస్టోర్‌లో సుమారు రూ.12 లక్షల విలువైన రాగి, ఇత్తడి, అల్యూమినియం సామగ్రి చోరీ జరిగింది. - 8లో

## న్యూస్‌రీల్

### కలెక్టరేట్‌లో కిశోరి వికాసంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వసంతబాయి

**తిరుపతి అర్బన్:** కలెక్టరేట్‌లో గురువారం ఐసీడీఎస్‌తోపాటు యునిసెఫ్, పడాల చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై వర్క్‌షాపు నిర్వహించారు. కిశోరి వికాసం–ప్రాంతీయ స్థాయి వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశం బాల్య వివాహాల నిర్మూలన, బేటీ బచావో–బేటీ పడావో, బాలకల విద్య, ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం తదితర అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, సీనియర్ కన్సల్టెంట్లు నరసింహమూర్తి, మేరీ జాన్, యునిసెఫ్ ప్రతినిధి పడాల సూర్య ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీలత, బాలల సంరక్షణ అధికారి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు స్విమ్స్ 14వ స్నాతకోత్సవం

**తిరుపతి తుడా:** శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) 14వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ వైద్య కమిషన్ చైర్మన్ డాక్టర్ అభిజత్ చంద్రకాంత్ షేత్ తెలిపారు.

### ఏపీ ఈసెట్‌కు 97.06 శాతం హాజరు



శ్రీరామ కళాశాల వద్ద విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

**తిరుపతి సిటీ:** జిల్లాలో జరిగిన ఏపీ ఈసెట్–2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గురువారం తిరుపతిలోని మూడు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 97.06 శాతం విద్యార్థులు హాజరైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ తెలిపారు. కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో, రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో, జూపార్క్ రోడ్డులోని అయాన్ డిజిటల్ సెంటర్లలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగిన పరీక్షకు 1003 మంది హాజరు కావాల్సి ఉండగా 972 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

### రేపటి నుంచి పీజీ పరీక్షలు

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ పరిధిలో నడుస్తున్న కళాశాలలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్, ఎంఈడీ, ఎంఎల్ఐసీ తదితర పీజీ కోర్సులకు సంబంధించి రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు హాల్‌టికెట్లను ఇప్పటికే విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. కర్షకులు రూ.వేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినా కష్టార్జితం దక్కడం లేదు. చివరికి పండిన పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మద్దతు ధర ప్రైవేటు వ్యాపారుల కంటే తక్కువగా ఉండడంతోపాటు నాణ్యమైన సరుకు మాత్రమే కొనుగోలు చేస్తోంది. దీంతో పుడమి పుత్రులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. గిట్టుబాటు ధర దక్కక నష్టపోవాల్సి వస్తోంది.




# కొనుగోడు పట్టదా?

**తక్కువ ధరలకే ధాన్యం విక్రయం**

- పెట్టుబడి ఎకరాకు రూ.43 వేలు ఖర్చు
- రాబడి ఎకరాకు రూ. 44 వేలు
- అప్పుల ఊబిలో అన్నదాతలు

**తిరుపతి అర్బన్:** అన్నదాతలకు గిట్టుబాటు దక్కక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రెండేళ్లుగా చూస్తే పాత ధరల కన్నా తక్కువ ధరలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి సీజన్‌కు ఎరువుల ధరలు, కూలీలు రెట్టింపు అవుతున్నాయి. పంటకు మాత్రం సరైన గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఈ ఏడాది రెండు సార్లు ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. మరోవైపు యూరియా కొరత కారణంగా బ్లాక్‌లో రెట్టింపు ధర పెట్టి కొనుగోలు చేశారు. ఇన్ని అవస్థలు పడి పంట పండించినా దిగుబడి తగ్గింది. పండిన ధాన్యం విక్రయించడానికి గత ఏడాది ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యం క్వింటాల్ రూ.2,389, సాధారణ రకం రూ.2,369కి కొనుగోలు చేసింది. ఈ ఏడాది అదే ధరలకు కొనుగోలు చేస్తోంది. సాధారణంగా ఏటా క్వింటాపై రూ.200 నుంచి రూ.300 ధర పెంచాల్సి ఉంది. ధర పెంచకపోవడంతో రైతులకు ఎకరాకు రూ. 6వేల నుంచి రూ.9 వేలు నష్టం తప్పలేదు.



కనుమరుగు అవుతున్న వేరుశనగ పంట

**తగ్గుతున్న వేరుశెనగ సాగు**

రాష్ట్రంలో అనంతపురం తర్వాత అత్యధికంగా వేరుశనగ పంటను సాగు చేస్తున్న జిల్లా తిరుపతి. అయితే పంటసాగు చేయడానికి ప్రతి సీజన్‌లో ప్రభుత్వం నాణ్యమైన వేరుశనగ విత్తనాలను సబ్సిడీతో అందించేది. ఏటా రబీన్‌లో 10 వేల ఎకరాలకు పైగా వేరుశనగ రాయితీ విత్తనాలు ఇవ్వగా గత ఏడాది మాత్రం కేవలం 2 వేల ఎకరాలకు రాయితీ విత్తనాలు ఇచ్చారు. ఈ ఏడాది రబీలో వేరుశనగ ధరలు పెరిగాయని రాయితీ విత్తనాలు ఇవ్వలేదు. దీంతో సాగు గణనీయంగా తగ్గింది. మరోవైపు పంటకు దిగుబడి తగ్గింది. దీనికితోడు ఈ సారి ఎకరానికి 22 బస్తాల నుంచి 25(40 కిలోలు) బస్తాలకు పడిపోయింది. ప్రస్తుతం వేరుశనగ కాయలు బస్తా రేటు రూ.2950 నుంచి రూ.3050కి పడిపోయింది. దీంతో ఎకరాకు రైతుకు రూ. 10వేలు నుంచి రూ.12 వేలు నష్టం నష్టం తప్పడం లేదు.

**వరికి ఉరి**

జిల్లా వ్యాప్తంగా అధిక శాతం మంది రైతులు ఆర్ఎన్ఆర్ 15048(షుగర్ లెస్) రకం సాగు చేశారు. ఈ ధాన్యం ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్ రూ.2,590కి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నాణ్యమైన ధాన్యం మాత్రమే కింటాల్‌కు రూ.200 తక్కువతో రూ.2,389కి కొనుగోలు చేస్తోంది. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. అయితే ప్రైవేటు వ్యాపారులు బస్తాకు రూ.5 కేజీలు అదనంగా వేసుకోవడంతోపాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వ్యాపారులు డబ్బులు సకాలంలో ఇవ్వడం లేదు.

**95 శాతం వరి సాగు**

వ్యాపార పంటలు మినహాయిస్తే ఆహార పంటల్లో 95 శాతం భూమిలో వరి పంట సాగు చేస్తున్నారు. మిగిలిన 5 శాతం జొన్నలు, రాగులు, సజ్జలు, వేరుశనగ, మినుములు తదితర పంటలు సాగు చేస్తున్నారు.

**రబీలో సాగు వివరాలు**

| పంట | విస్తీర్ణం(ఎకరాల్లో) |
|---|---|
| వరి | 2.70 లక్షలు |
| వేరుశనగ | 6 వేలు |
| ఉలవలు | 93 |
| రాగులు | 79 |
| మినుము | 45 |
| జొన్న | 40 |
| మిరప | 550 |
| కూరగాయలు | 850 |

**సాగు, దిగుబడి వివరాలు**

| సంవత్సరం (రబీ) | సాగు (ఎకరాల్లో) | దిగుబడి (బస్తాల్లో) |
|---|---|---|
| 2024 | 2.35 లక్షలు | 35 నుంచి 40 |
| 2025 | 2.50 లక్షలు | 30 నుంచి 35 |
| 2026 | 2.70 లక్షలు | 28 నుంచి 30 |

**సీజన్ల వారీగా వేరుశనగ సాగు వివరాలు**

| సీజన్ | సాగు ఎకరాలు(వేలల్లో) |
|---|---|
| 2024 ఖరీఫ్ | 12 |
| 2024 రబీ | 15 |
| 2025 ఖరీఫ్ | 8 |
| 2025 రబీ | 11 |
| 2026 రబీ | 6 |

**ఎకరా వరి సాగు ఖర్చుల వివరాలివీ..**

| పనులు | ఖర్చు(రూపాయల్లో) |
|---|---|
| విత్తనాలు 40 కిలోల బస్తా | 1500 |
| నారుమడి తయారీ ఖర్చు | 1400 |
| విత్తనాలు చల్లడానికి కూలీలు | 500 |
| దుక్కి | 5వేలు |
| గట్లు వేసే కూలీలు | 1400 |
| చెక్క తోలే ఖర్చు | 2 వేలు |
| ఎరువులు చల్లే కూలీలు | 6400 |
| నారు పీకడం, నాట్లు | 6300 |
| ఎరువులు | 4800 |
| కలుపు కూలీలు | 5600 |
| ఎరువులు చల్లే కూలీలు | 3500 |
| వరికోత మిషన్ కూలీలు | 2800 |
| ధాన్యం తరలింపు ఖర్చు | 1000 |
| అధనపు ఖర్చులు | 800 |
| మొత్తం ఖర్చు | 43 వేలు |

**గిట్టుబాటు ధర నిర్ణయించండి**



ఏ పంటకు ఎంత ధర ఇస్తామనే సమాచారాన్ని రైతులకు ముందే తెలియజేయాలి. ఏ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉందో అవగాహన కల్పించాల్సి ఉంది. 95 శాతా నికి పైగా వరి పంటనే సాగు చేస్తున్నారు. మరో ఐదేళ్లకు 100 శాతం రైతులు వరి పంటనే సాగు చేసే అవకాశాలున్నాయి. ఇతర వ్యాపార, వాణిజ్య పంటలపై అవగాహన కల్పించి, వాటికి గిట్టుబాటు ధరలు ఇవ్వాలి. అన్ని పంటలకూ గిట్టుబాటు ధరలు లేవు. దీంతో రైతులు దిక్కులు చూస్తున్నారు. – ఇన్నమాల జయరామయ్య, రైతు

**రాయితీలు ఇవ్వాలి**



రైతు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రాయితో ఇవ్వాలి. అప్పుడే పెట్టుబడులు తగ్గుతాయి. అలా చేయడం లేదు. ప్రధానంగా కూలీల ధరలు పెరుగుతున్నాయి. ఒక ఎకరం పంటకు సాగు చేసిన నాటి నుంచి ఒబ్బిళ్ల వరకు మొత్తంగా 100 మంది కూలీలు కావాల్సి ఉంటుంది. అంటే ఏటా కూలీల పెట్టుబడి రూ.10 వేలు అదనంగా ఖర్చు చేస్తున్నాం. అయితే ధాన్యం ధర మాత్రం పెరగడం లేదు. – గాయం కృష్ణయ్య,రైతు

**తక్కువ ధర నిర్ణయం సరికాదు**



వరి పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నప్పటికీ ధాన్యం ఎంతో నాణ్యతగా ఉండాలని చెబుతున్నారు. అయితే మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారుల కంటే తక్కువ ధర నిర్ణయించడం సరికాదు. ఏటా ఎరువుల ధరలు పెంచేస్తున్నారు. పురుగు మందుల ధరలు పెరుగుతున్నాయి. కూలీల ధరలు, భూమి దుక్కిచేయడానికి ట్రాక్టర్ ఖర్చులు పెరుగుతున్నాయి. దిగుబడి తగ్గుతుంది. ఇలా అయితే రైతులు అప్పుల ఊబిలోకి వెళ్లాల్సిందేనని ఆందోళన తప్పడం లేదు. –కొక్కుముళ్ల కాటయ్య, రైతు

## విద్యార్థుల సంఖ్యను పెంచండి



పిల్లలతో కలసి ప్రచార రథాన్ని ప్రారంభోత్సవం చేస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో 'బడి పిలుస్తోంది – ఇంటింటి ప్రచార రథం' కార్యక్రమాన్ని ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి వినూత్న రీతిలో కృషి చేస్తున్నారని అన్నారు. అలాగే రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల సౌజన్యంతో 'బడి పిలుస్తోంది – ఇంటింటి ప్రచార రథం' ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందని చెప్పారు. 36 రోజుల్లో 36 మండలాల్లో జోరుగా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కేవీఎన్ కుమార్, డీవైఈఓ ఇందిరాదేవి, సమగ్రశిక్ష సీఎంఓ సురేష్, ఏఎంఓ చంద్రశేఖర్‌నాయుడు, సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, మీనాక్షి, సారధి, భువనేశ్వరి, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నాద్ లింగుట్ల, ప్రతినిధి డాక్టర్ దేవరాజులు పాల్గొన్నారు.

## పాలిసెట్ రేపు

**తిరుపతి సిటీ:** పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలిసెట్–2026 శనివారం జరగనున్నట్లు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ డాక్టర్ వై ద్వారకనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో రేణిగుంట, వెంకటగిరి, సత్యవేడులో ఒక్కొటి చొప్పున, నాయుడు పేటలో రెండు, శ్రీకాళహిస్తిలో రెండు, పుత్తూరులో రెండు, తిరుపతిలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 17 సెంటర్లలో 5,143 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్ష కేంద్రాలకు గంట ముందే విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. మొబైల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని వెల్లడించారు.

## తిరుమలలో పద్మావతి పరిణయోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



తిరుమలలో ఏర్పాటు చేసిన మండపం

**తిరుమల:** తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో ఏప్రిల్ 25వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్న పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో పరిణయోత్సవ మండపాన్ని దశావతారం, అష్టలక్ష్ములు తదితర ఆధ్యాత్మిక రూపాలతో దాదాపు 100 మంది నిపుణులు అలంకరిస్తున్నారని టీటీడీ ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పూణేకు చెందిన వేంకటేశ్వర రిలీజియస్ చారిటబుల్ ట్రస్ట్ రూ.30 లక్షలతో వేదికను వైభవంగా ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలో తొలిరోజు మలయప్పస్వామివారు గజవాహనంపై, రెండోరోజు అశ్వవాహనంపై, చివరిరోజు గరుడవాహనంపై ఊరేగుతారన్నారు. మరో వైపు ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీల్లో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారన్నారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం కనులపండుగగా నిర్వహిస్తారని తెలిపారు.

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 5 కంపార్ట్‌మెంట్లలో భక్తుల వేచి ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి వరకు 65,353 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,550 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకలరూపంలో హుండీలో రూ.4.43 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టంచేసింది.

## అతి గారాబం..

# అప్పులే ఐదుగురి మృతికి కారణమా?

**నారాయణవనం:** మండలంలోని వెంకటకృష్ణపాళేనికి చెందిన మోహన్ అతి గారాబంగా పెరిగి, ఆన్‌లైన్ గేమింగ్‌లో అధిక మొత్తంలో డబ్బు కోల్పోయి, అప్పులు పెరిగిపోవడంతోనే మోహన్ ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని స్థానికులు, సన్నిహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు పేరుకుపోవడంతో అప్పును తీర్చే క్రమంలో ఒత్తిడికి గురై తల్లిని, భార్యను చంపి, ఇద్దరి పిల్లలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రైల్వే మెయిల్ సరీ్వసులో ఉద్యోగం చేసుకుంటున్న పెద్దబ్బ, చంద్రకళ దంపతుల కుమార్తె రేఖ, కుమారుడు మోహన్ ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో వారసుడని మోహన్‌ను గారాబంగా పెంచారు. పెద్దబ్బ విధుల్లో ఉంటూ మృతి చెందాడు. నిరుద్యోగి అయిన మోహన్ తండ్రి ఉద్యోగంపై ఆసలు పెంచుకున్నాడు. కాగా నారాయణవనంలో క్లినిక్‌ను ప్రారంభించిన కోడూరుకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ కుమార్ అక్క కుమార్తె హరితను మోహన్ 15 ఏళ్ల కిందట ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఏ పనిపై శ్రద్ధ చూపని మోహన్ సోమరితనానికి అలవాటు కావడంతో భార్య హరిత టైలరింగ్ షాపును నడుపుతూ కుటుంబానికి అండగా నిలిచింది. కష్టపడి హరిత టైలరింగ్ షాపుతో పాటు బ్యూటీ పార్లర్‌ను ప్రారంభించి మరో ఐదుగురికి ఉపాధిని కల్పించే స్థాయికి ఎదిగింది. పనిపై శ్రద్ధ చూపని మోహన్ క్రమంగా ఆన్‌లైన్‌లో గేమింగ్‌లపై ఆకర్షితుడై రమ్మీ ఆడేవాడని, క్రమంగా డబ్బును కోల్పోతూ ఆన్‌లైన్ రుణాలు తీసుకోవడంతో భారీ స్థాయిలో అప్పులు పెరిగిపోయాయి. దీంతోనే ఒత్తిడి పెరిగి ఉంటుందని సన్నిహితుల ద్వారా తెలిసింది. ఈ క్రమంలో ఆన్‌లైన్ గేమింగ్‌పై నిలదీసిన తల్లిని, భార్యను చంపి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

**పిల్లలు ఇంటికి వెళ్లి ఉంటే..?**

బుధవారం ఉదయం 11 గంటల సమయంలో స్కూల్ నుంచి పిల్లలను ఉన్నపళంగా ఇంటికి తీసుకు వచ్చిన తండ్రి మోహన్‌తో పాటు కౌశిక్, హిమనిలు ఇంటికి వెళ్లి ఉంటే బతికి ఉండేవారు. తల్లి చంద్రకళ, ఆ తర్వాత భార్య హరితను చంపిన మోహన్ బ్యాంకు నుంచి నగదును డ్రా చేసుకున్నాడు. నగదును పక్కింటి రాధకు ఇచ్చిన మోహన్ తర్వాత తీసుకుంటానని చెప్పి, పుత్తూరులోని స్కూల్‌కు వెళ్లి మేనమామ చావుకు వెళ్లాలని చెప్పి కౌశిక్, హిమనిను ఇంటికి తీసుకు వచ్చాడు. ఇంటికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఇద్దరిని ఉండమని, స్కూల్ బ్యాగులను ఇంట్లో ఉంచడానికి వెళ్లాడు. తండ్రితో పాటు పిల్లలిద్దరూ ఇంటికి వెళ్లి.. తల్లి, నాన్నమ్మల మృతదేహాలను చూసి, అరుపులు వేసి ఉంటే మోహన్‌తో పాటు ఇద్దరూ బతికి ఉండే వారు. స్కూల్ వద్ద ఆడుకుంటున్న పిల్లలతో మాటలు కలవడం, తండ్రితో పాటు ఇంటికి వెళ్లకపోవడం పిల్లలకు శాపంగా మారింది. తండ్రితో కలిసి రైలు కింద పడి బలవర్మరణం పొందేవారు కారు.

**కబళించిన ఆన్‌లైన్ గేమింగ్**

మొదటి నుంచి గారాబంగా పెరిగిన మోహన్ ఏ పనిపై శ్రద్ధ చూపక సోమరితనానికి అలవాటు పడ్డాడు. స్మార్ట్ ఫోన్‌తో గడుపుతూ ఆన్‌లైన్ రమ్మీకి అలవాటయ్యాడని సన్నిహితుల ద్వారా తెలిసింది. క్రమంగా గేమింగ్‌లో నష్టపోతూ ఆన్‌లైన్‌లో అప్పులు చేశాడు. అధిక వడ్డీలతో పెరిగిన అప్పును చెల్లించమని ఒత్తిడి పెరిగినట్లు తెలిసింది. అప్పులను తీర్చడానికి పుత్తూరులోని ఇంటి స్థలాలను, ఆస్తులతో పాటు భార్య, తల్లి, పిల్లల నగలను తనఖా పెట్టి చెల్లించినా అప్పులు తీరలేదని తెలిసింది. ఆన్‌లైన్ లోన్‌లతో ఒత్తిడి పెరగడంతో నిలదీసిన అమ్మను, భార్యను కడతేర్చిన నేరంపై జైలుకు వెళితే పిల్లలు ఒంటరైపోతారని భావించిన మోహన్ రైలు కింద పడి బలవర్మణానికి గురై ఉంటాడని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మోహన్, హరితల ఫోన్‌ల లాక్‌ను తీసి పరిశీలిస్తే గాని పూర్తి సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**కురిసే పూలవాన.. రామయ్య మురిసేలోలోన..**



శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం స్వామివారి పుష్పయాగం కనుల పండుగగా సాగింది. ఇందులో భాగంగా ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు సీతాలక్ష్మణ కోదండ రామస్వామివారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఊంజల్ మండపంలో అర్చకుల వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి పుష్పయాగం వైభవంగా జరిపారు. తులసి, రోజా, తామర, చామంతి, మల్లె, గన్నేరు, కనకాంబరాలు, కలువ తదితర 12 రకాల పుష్పాలు, ఆరు రకాల ఆకులతో కలిపి మొత్తం 3 టన్నుల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేశారు. రాత్రి 7 గంటలకు సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారు నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. – తిరుపతి కల్చరల్

